**కథ**

**లీల ఊరెళ్ళి వచ్చినప్పట్నుంచి అదోలా ఉంటోంది. ఈ వారం రోజులుగా పిల్లల పరీక్షలు, నాకు ఆఫీస్‌లో ఆడిట్ జరుగుతుండటంతో లీలతో తీరుబడిగా మాట్లాడటానికి అవకాశం దొరకలేదు.**

# ఆసరా

ఆ రోజు ఆదివారం. ఇంట్లో ఆలస్యంగా తెల్లవారింది. పిల్లలు టిఫిన్ తిని ఆడుకోవటానికి బైటికి వెళ్లారు. ఆయన పేపర్‌లో మునిగిపోయారు. నేను వంట ప్రయత్నంలో ఉన్నాను. వంట గదిలోనే సింక్ దగ్గర నిలబడి అంట్లు తోముతోంది లీల. అప్పుడు గుర్తొచ్చింది లీల అలా ఎందుకు ఉదాసీనంగా ఉందో అడగాలని.

''ఏంటి లీలా ఊరెళ్ళి వచ్చిన రోజునుంచి ఏదోలా ఉంటున్నావు. అందరూ బాగున్నారా?'' అడిగాను.

''అంతా బాగానే ఉన్నారు. నాకే వచ్చింది రోగం'' అంది విసురుగా.

''ఏమైంది అంత కోపంగా ఉన్నావు?'' నవ్వుతూనే అడిగాను.

''మా నాన్న నాకు పెళ్ళి చేస్తాడట'' అంది అంట్లు తోమటం ఆపకుండానే.

''అబ్బో మీ నాన్నకి ఈ బాధ్యత బాగానే గుర్తొచ్చిందే. తాగుడు మానేశాడా?'' అని ''రవీ, గీత పెద్దవాళ్ళయ్యారుగా. నాకూ ఇబ్బందేమీ ఉండదులే చేసుకో'' అన్నాను.

''మీకే ఇబ్బంది, కష్టం ఉండవు. నాకే'' అంది చేతిలో గిన్నె పరపరా తోమేస్తూ.

''ఏంటి నీ గోల? నీ బాధేంటో అర్థమయ్యేటట్టు చెప్పు'' విసుక్కున్నాను.

''నాకు పెళ్ళి ఇష్టం లేదు'' అంది.

''అదేం? ఐనా నీకు 20 ఏళ్ళు వచ్చాయి. ఇంకా చిన్నపిల్లవా?'' అన్నాను మందలిస్తున్నట్టు.

''పెళ్ళంటే నాకు భయం, అసహ్యం'' అంది.

''ఎందుకూ?'' అన్నాను ఆశ్చర్యంగా.

''నీకు తెలియదక్కా. మా ఇళ్ళలో అందరూ తాగుబోతులే. మా అమ్మ ఎలా చచ్చిపోయిందనుకున్నావ్. మా నాన్న తాగొచ్చి కొట్టే దెబ్బలు తట్టుకోలేక ప్రాణం పోయింది'' అంది. దయనీయంగా ఉన్న లీల ముఖం చూస్తే జాలేసింది.

''నువ్వు భలే ఉన్నావ్. అందరూ అట్లాగే ఉంటారా?'' అన్నాను.

''మా వాడలో చూస్తుంటాగా చాలామంది అంతే. నన్ను చేసుకోబోయేవాడు మంచివాడై ఉంటాడన్న ఆశ నాకేం లేదు'' అంది.

''అసలు ఇంతవరకూ నీకు పెళ్ళి చేసుకునే వయసు వచ్చిందనే ఆలోచన నాకు రాలేదు. ఎంతయినా తండ్రి తండ్రే'' అన్నాను మాట మారుస్తూ.

''నా బొంద తండ్రి. ఏదో లాభం లేనిదే నాకు పెళ్ళి చేయాలనే ఆలోచన వచ్చుండదు. అసలు నాకు పెళ్లి చేసుకునే ఉద్దేశం కానీ, మళ్ళీ మావూరు వెళ్ళే ఆలోచనగానీ లేవు. జీవితాంతం మీ ఇంట్లోనే పని చేసుకుంటూ గడిపేస్తా. నన్ను మీ ఇంట్లో ఉండనియ్యవా అక్కా!'' బేలగా అడిగింది.

''మీ నాన్న ఊరుకుంటాడా?'' అన్నాను.

''ఊరుకోక ఏం చేస్తాడు? అసలింక ఆ వూరు కూడా వెళ్ళను. ఏదో ఆ చిన్న పిల్లల గురించి కానీ, లేకపోతే ఆ వూరు వెళ్ళటం కూడా నాకిష్టం లేదు'' ఖచ్చితంగా చెప్పింది.

''సరేలే సంబంధం కుదిరిందా? పెళ్ళి చూపులా'' అడిగాను.

''కుదిరినట్టే. నేను సరేనంటే ఐపోతుంది'' అంది.

''అతనేం చేస్తాడు?''

''ఇక్కడే ఏదో స్కూల్లో అటెండర్‌గా చేస్తాట్ట. రాజాలాంటి సంబంధం. చేసుకో అంటూ మా వాళ్ళంతా నా ప్రాణం తీస్తున్నారు.''

''మరి మీ వాళ్ళందరూ సరే అన్నాక ఆగుతుందా? చేసుకో'' అన్నాను.

''నాకు తాగుబోతులంటే భయం, అసహ్యం. నాకు నచ్చిన వాడు దొరకటం కష్టం. కాబట్టి పెళ్ళి చేసుకోకూడదనే నిర్ణయించుకున్నాను'' అంది.

''మీ ఇళ్ళలో తాగుడు తప్పేం కాదు. చాలామందికి ఉండే అలవాటే. తాగుబోతులంతా చెడ్డ వాళ్ళు కారుగా'' అన్నాను.

''మా నాన్న తాగుబోతు. మా అన్న తాగుబోతు. వాళ్ళు తాగివచ్చి ఎంత గొడవ చేస్తారో చిన్నప్పటి నుండి చూస్తూనే ఉన్నాను. పెళ్ళి చేసుకోనని తెగేసి చెప్పి వచ్చాను. నాతో మాట్లాడి నన్ను ఒప్పించాలని మా అన్న అనుకుంటున్నాడు. ఇక్కడికి వస్తానంటే నేనే వద్దన్నాను'' అంది.

★ ★ ★

లీల మా ఇంట్లో ఎనిమిదేళ్ళ నుంచి పనిచేస్తోంది. మా వాళ్ళ వూరి దగ్గర పల్లెటూరు వాళ్ళది. లీలకి తల్లి లేదు. తండ్రి, అన్న, ముగ్గురు చెల్లెళ్లు.

రవి పుట్టినప్పుడు మా ఇంట్లో వుండి బాబుని చూసుకోవటానికి ఓ పనిపిల్ల కావాలని గాలించి, గాలించి లీలని పట్టుకున్నాను. లీల కజిన్ ఒకామె ఈ ఊళ్లోనే ఉంటుంది. ఆమె ద్వారా లీల మా ఇంట్లో పనికి కుదిరింది. పనిలో పెట్టటానికి లీల తండ్రి ఓ పట్టాన ఒప్పుకోలేదు. ఆడపిల్లని వేరే ఊరు పంపనని, పొలం పనులు చేసుకుంటుందని అన్నాడు. అతన్ని ఎన్నో విధాలా కన్విన్స్ చేసి లీలని తెచ్చుకున్నాం.

పదమూడేళ్ళ లీల నీట్‌గా ఉండి చురుకైన పిల్లలా అనిపించింది చూడగానే. నేను ఆఫీస్‌లో జాయిన్ అయ్యేలోపు బాబు పనులన్నీ నేర్చేసుకుంది. ఇంటి పనులన్నీ ఎంతో బాధ్యతగా చేస్తుంది.

మూడు నెలలు ఉన్నాక, ఇంట్లో వాళ్ళకి దూరంగా ఉండలేనని వెళ్ళిపోతానని గొడవ చేసింది. తనిక్కడ పనిచేస్తే ఎన్ని లాభాలున్నాయో, ఆ పల్లెటూరిలో కంటే ఈ పట్నంలో ఉంటే ఎంత హాయిగా ఉంటుందో ఎన్నో రకాలుగా వర్ణించి చెప్పాక ఉండటానికి ఒప్పుకుంది.

ప్రతి నెల రెండో శనివారం తన వూరు వెళ్ళేది. వెళ్ళేటప్పుడు చెల్లెళ్ళకి చిన్న చిన్న వస్తువులు కొనుక్కువెళ్ళేది. వాళ్ళకోసం నేను తెలిసిన వాళ్ళ దగ్గర పాత డ్రెస్‌లు సేకరించి ఇచ్చేదాన్ని.

మా ఇంట్లో మంచి తిండి, బట్టలు, ఆధునిక సౌకర్యాలు అన్నిటికి అలవాటు పడిపోయింది లీల. ఇప్పుడు లీలని చూస్తే ఎవ్వరూ పల్లెటూరి చదువు, సంధ్యల్లేని పిల్లంటే నమ్మరు. మాట తీరు కూడా చక్కగా ఉంటుంది.

★ ★ ★

లీల అభిప్రాయంతో ప్రమేయం లేకుండా తన పెళ్ళి గుళ్లో జరిగిపోయింది. అతన్ని చూడగానే రెండో పెళ్ళి వాడేమో అనిపించింది. పెళ్ళికొడుక్కి, లీలకి వయసులో చాలా తేడా ఉంటుందనిపించింది. అది కూడా లీల అయిష్టానికి ఓ కారణం కావచ్చు.

★ ★ ★

ఆరోజు ఆఫీసులో లేటయ్యింది. పిల్లలేం గోల చేస్తున్నారో అనుకుంటూ వచ్చాను. బజారెళ్ళి వస్తానని ఆయన వెళ్ళిపోయారు.

లోపలికి వెళ్ళగానే లీల కజిన్ కనిపించింది.

''లీల మీ ఇంటికి వచ్చిందాండీ?'' అడిగింది.

''రాలేదే'' అన్నాను ఆశ్చర్యంగా.

''వచ్చిందమ్మా. లోపల రూంలో తలుపేసుకుంది'' అంది పాప.

''ఔనా'' అని. ''లీలా తలుపుతీయ్''

అన్నాను.

''మా అక్కని వెళ్ళమను. అది వెళ్తేనే తలుపు తీస్తాను'' అంది లీల మొండిగా. ఏదో గొడవ పడి వచ్చేసిందని అర్థమైంది నాకు.

''లీలా రావే! మా తల్లి కదూ'' అంది వాళ్ళక్క బ్రతిమలాడుతున్నట్టు.

''నువ్వెళ్ళు. ఇంకెప్పుడూ రాకు'' అంది లీల తలుపు తీయకుండానే.

''ఏంటి గొడవ'' అడిగాను.

''అది మొగుణ్ణి వదిలేస్తుందట'' అంది.

''ఔనా?'' ఆశ్చర్యపోయాను.

''మగాడు, మొగుడు అన్నాక తాగకుండా, తిరక్కుండా ఉంటాడా? నాకా సంసారం వద్దని పారిపోయివచ్చింది'' అంది ఫిర్యాదు చేస్తున్నట్టుగా.

పెద్ద సీన్ క్రియేట్ అయ్యేలా ఉందనిపించి, ''నేను మాట్లాడతాలే నువ్వెళ్ళు. ఆవేశంలో ఉన్నప్పుడు రెచ్చగొట్టటం మంచిది కాదు'' అన్నాను.

''మీరు చెప్తున్నారు కాబట్టి పోతున్నా. ఇప్పుడది సంసారం వద్దనుకుంటే కులం తప్పు కింద డబ్బు కట్టాలి. దానికి మీరే నచ్చచెప్పండి'' అని వెళ్ళిపోయింది.



నేను మా పనిలో పడిపోయాను. లీల ఎప్పుడు వచ్చిందోకానీ ఇల్లు, అంట్లు శుభ్రం చేసి కూరకి తరిగిపెట్టి ఉంచింది. పిల్లలకి పాలు, టిఫిన్ ఇచ్చింది.

ఓ అరగంట గడిచాక లీల గది తలుపు తీసుకుని బైటికి వచ్చింది.

కుర్చీలో కూర్చుని రిలాక్స్ అవుతున్న నా దగ్గరికి వచ్చి కాళ్ళ దగ్గర కూర్చుని ఏడవటం మొదలుపెట్టింది.

నాకు భయమేసింది. ''ఏమయ్యింది? ఎందుకేడుస్తున్నావ్'' అడిగాను కంగారుగా.

''నేను వాణ్ణి వదిలేస్తాను. మీ ఇంట్లోనే పని చేస్తూ ఉంటా. నేనింక అక్కడికి వెళ్ళను'' ఏడుస్తూనే చెప్పింది.

''సరేలే ముందు ఏడవటం ఆపు. నీ ఏడుపు చూస్తుంటే నా బుర్ర పనిచేయట్లేదు'' అన్నాను.

లీల ఏడుపు ఆగాక అడిగాను ''ఇప్పుడు చెప్పు. ఏమయ్యింది'' అని.

''అక్కా! వాడు తాగి ఓ మూల పడుకుంటే సర్దుకుపోదామనే అనుకున్నా. కానీ వాడికి లేని అలవాటు లేదు. తిరుగుబోతే కాదు, అనుమానం పీనుగ. రోజూ నన్ను కొట్టి డ్యూటీకి వెళ్ళేటప్పుడు తాళం వేసుకుని వెళ్ళే వాడు''

''అయ్యయ్యో'' అన్నాను బాధగా.

''పెళ్ళి వద్దంటే మంచివాడు చేసుకో అని నన్ను బలవంతం చేసిన వాళ్ళందరూ, మగాడు ఆమాత్రం చెయ్యడా నువ్వే భరించాలి అని నాకు బుద్ధులు చెబుతున్నారు. పైగా అసలు నువ్వెందుకన్ని షోకులు చేసుకుంటావు. అందుకే వాడికి అనుమానం అంటున్నారు. నువ్వే చెప్పక్కా నేను ఏం షోకులు చేసుకుంటాను?'' అడిగింది.

లీల నీట్‌గా ఉంటుంది. అదే వాళ్ళకి అతి అనిపించింది. నేను పెళ్ళికి వెళ్ళినప్పుడు చూశాను. వాళ్ళందరిలో లీల ప్రత్యేకంగా అనిపిస్తుంది.

''నావల్ల కాదక్కా చింకిగుడ్డలు కట్టుకుని, చింపిరి జుట్టుతో ఉండటం. నీట్‌గా ఉంటే వాడికి అనుమానం'' అంది నిస్సహాయంగా. మనసంతా జాలితో నిండిపోయింది నాకు.

చాలా ఏళ్ళ నుంచి మా ఇంట్లో ఉంటూ ఓ రకమైన లైఫ్‌స్టైల్‌కి అలవాటు పడింది. నేను, ఆయనా గట్టిగా మాట్లాడుకోవడం కూడా తక్కువే. మా ఇంటి చుట్టుపక్కల వాళ్ళు కూడా మర్యాదస్తులే. దాంతో లీలకి భార్యాభర్తలు ఎలా ఉండాలో ఓ అభిప్రాయం ఏర్పడిపోయింది.

అలాంటి లైఫ్ తనకి దొరకదు. అందుకే అసలు పెళ్ళే వద్దనుకుంది.

కానీ బలవంతంగా పెళ్ళి జరిగిపోయింది.

ఇప్పుడు ఎడ్జస్ట్ కాలేకపోతోంది. మానసికంగా తానెంత నలిగిపోతోందో నాకర్థమవుతోంది.

కానీ ఈ విషయంలో నేనేం చేయగలను?

''ఏంటక్కా మాట్లాడవు'' అని లీల గట్టిగా అడగటంతో ఆలోచనలు చెదిరాయి.

''ఏమడిగావు?'' అడిగాను.

''విడిపోయి ఎలా బ్రతుకుతావని వాళ్ళంతా అడిగారు.

మా అక్కా వాళ్ళు వాళ్ళ ఇంట్లోనే ఉంచుకుంటారని చెప్పాను.

వాళ్ళ అవసరం తీరాక తరిమేస్తారు. జీవితాంతం పోషిస్తారా అని ఎగతాళి చేశారు'' అంది.

''అక్కా మీ ఇంట్లో పనిచేస్తూ ఉంటాను. ఉండనియ్యవా ప్లీజ్'' దీనంగా అడిగింది.

చాలా బాధనిపించింది నాకు.

''పరిష్కారం ఆలోచిద్దాం. నువ్వు ప్రశాంతంగా ఉండు'' అన్నాను. కళ్ళు తుడుచుకొని లేచి లోపలికి వెళ్ళింది లీల.

నా మాటకే ఆ కళ్ళలో భవిష్యత్ మీద భరోసా

**బి.వి.శేషమాంబ**

కనిపించింది నాకు.

★ ★ ★

ఆ రాత్రే లీల సంగతి చెప్పాను ఆయనకి.

''ఏం చేయాలనుకుంటున్నావ్'' అనడిగారు వెంటనే.

''మీరే చెప్పండి'' అన్నాను.

''నువ్వు లీలని సపోర్ట్ చేస్తే వాళ్ళంతా నీమీద దండెత్తుతారేమో'' అన్నారు.

''కానీ ఏదో రకంగా నేను లీలకి సాయం చెయ్యాలి. పల్లెటూరిలో ఉన్న దాన్ని నా అవసరం కోసం తీసుకువచ్చి తన లైఫ్ స్టైల్‌ని మార్చేసిన నేనే దీనికంతటికీ కారణమేమో అని నేను చాలా గిల్టీగా ఫీలవుతున్నాను'' అన్నాను బాధగా.

★ ★ ★

మర్నాడు లీల తండ్రి, అన్న వచ్చారు. వాళ్ళ మాటల సారాంశం ఏంటంటే లీలని నేనే రెచ్చగొట్టి సంసారాన్ని పాడుచేస్తున్నానట. నా అలుసు చూసుకునే తను విడిపోతానని గొడవ చేస్తోందట. వాళ్ళ పరువు పోతోందట.

మాలాంటి పెద్దవాళ్ళ ఇంట్లో ఉండి లీల నిక్కుతూ, నీలుగుతోందట. మా ఇంట్లో ఉన్నా లీల వాళ్ళ పిల్లే కాబట్టి వాళ్ళలాగే ఉండాలట.

గొంతెమ్మ కోరికలు ఉండకూడదట.

మా ఇంట్లో టి.వి., సినిమాలు చూసి చెడిపోయిందట. ఆశలు ఎక్కువైనాయట. చివరికి ''మీరు దాన్ని ఇంట్లోంచి తరిమేయండి, మొగుడి దగ్గరికి పోక ఏం చేస్తుంది'' అన్నారు.

''నన్ను బలవంతంగా పంపిస్తే చచ్చిపోతాను'' అంది లీల.

''అదేదో అక్కడే చావు. నువ్వు ఇక్కడ ఉండటానికి వీల్లేదు. మాతో రావలసిందే'' అన్నాడు అన్న.

''చూస్తుంటే లీలని తీసుకెళ్ళి ఆ యింట్లో పడేస్తే చాలనుకుంటున్నట్టున్నావు కానీ తన సుఖం ఆలోచించట్లేదు'' అన్నారాయన కోపంగా.

''విడిపోతే ఏం సుఖం'' అన్నాడు తండ్రి.

''కలిసుంటే నాకు సుఖం లేదు'' అంది లీల.

''విడిపోదల్చుకుంటే కులం తప్పు కింద ఐదు వేలియ్యి'' అన్నాడు చివరికి.

''దాని దగ్గర పైసా లేదు'' వెకిలిగా నవ్వాడు అన్న.

''ఉన్న కొద్దో గొప్పో డబ్బు పెళ్ళి ఖర్చులకని ఖాళీ చేసిన సంగతి బాగానే గుర్తుపెట్టుకున్నావు'' అన్నాను.

ఐదు వేలతో లీల బ్రతుకు అటో ఇటో తేలిపోతుంది. ఆ డబ్బు కూడా అందరూ కలిసి తాగి తందనాలు ఆడటానికే.

''ఆ డబ్బు మీరివ్వండి సార్! జీవితాంతం మీ ఇంట్లోనే పనిచేసి బాకీ తీర్చుకుంటా'' అంది లీల ఏడుస్తూ.

''ఐదు వేలు ఇవ్వటం కష్టం కాదు. కానీ తర్వాత నీ భవిష్యత్ ఏంటని ఆలోచిస్తున్నా'' అన్నారాయన.

''తనకిప్పుడు కావలసింది మోరల్ సపోర్ట్. ఉండటానికి భద్రమైన చోటు.

ముందా ఐదు వేలు కట్టి తర్వాత మిగతాది ఆలోచిద్దాం'' అనేశాను.

ఆ తర్వాత ఐదు వేలు తీసుకుని, ఇంక లీల చచ్చిపోయిన దానికిందే లెక్కని తేల్చేసి వెళ్ళిపోయారు తండ్రి, కొడుకు.

★ ★ ★

కొద్దిరోజులు టైలరింగ్ నేర్చుకున్న లీల ఏ టైలర్ దగ్గరైనా అసిస్టెంట్‌గా చేరచ్చు.

లేదా తను ఇంకా కొంతమంది ఇళ్ళలో పని చేసుకోవచ్చు.

అదీకాకపోతే ఈ కాలనీలో కొంతమంది పసిపిల్లలతో, చూసుకునే వాళ్ళు లేక ఇబ్బందిపడుతున్నారు. మా ఇంట్లోనే ఉండి ఆ పిల్లల్ని చూసుకుంటూ ఉండొచ్చు.

ఆ పని, ఈ పని అని కాకుండా ఏ పనైనా చేయగల లీలలాంటి వాళ్ళకి బ్రతుకు తెరువు లభించటం కష్టం కాదు.

తనకి కావలసిన మోరల్ సపోర్ట్, భద్రత కల్పిస్తే తాను సుఖంగా బ్రతుకుతుందనిపించింది.

లీల పెళ్ళి కుదిరినప్పటి నుంచి తన బాధ చూసి గిల్టీ ఫీలింగ్‌తో నలిగిపోతున్న నాకు మనశ్శాంతి దొరికింది.

దానిక్కారణం తను ధైర్యంగా తెగతెంపులు చేసుకోవటానికి సిద్ధపడటమే. ఆ తెగింపు తనలో లేకపోతే ఇద్దరం అశాంతి పాలయేవాళ్ళం.

✤



## కొత్త అవతారం

ఎగ్స్ట్రా ఇన్నింగ్స్ పేరుతో సెట్ మ్యాక్స్ ఛానెల్ తెరపై ఓ వెలుగు వెలిగిన మందిరాబేడి గుర్తుందా? వరల్డ్‌కప్ సందర్భంగా ఆమె క్రికెట్ గురించిన చేసిన వ్యాఖ్యానం అందరికీ చిరపరిచితమే. ఇప్పుడామె సినీ ఇండ్రస్టీలోకి ప్రవేశించబోతోంది. పార్థిపన్ అనే పేరుతో ఆమె ఓ సినిమాకి నిర్మాతగానే కాకుండా దర్శకత్వం వహించడమే కాకుండా ఆ చిత్రంలో ఓ ప్రత్యేకపాత్రలో కన్పించబోతోంది. ఈ చిత్రానికి సంబంధించిన కొన్ని పనుల నిమిత్తం చెన్నైకి వచ్చిన మందిరా హిందీలో రాసిన డైలాగుల్ని చదువుతూ కన్పించింది. యంగ్ హీరోల పక్కన నటించడానికే తాను ప్రాధాన్యతనిస్తానని చెప్పే మందిరా తన అందం, హావభావాలతో అందర్నీ కట్టిపడేస్తుంది.